

# గుళికలు
## రమానాథ్ కందాళ

| | |
|---|---|
| | *గుళికల గురించి* |
| *కుదురు రోగము:* | *అపూర్వ ప్రయోగములైనందున అనిర్ధారితము.* |
| *పదార్థములు - పాళ్ళు:* | *మీకు తెలిసిన మాకు తెలియచేయ మనవి* |
| *వాడకము:* | *నెలకో గుళిక* |
| *వాడుక సూచన:* | *గొంతునకడ్డము పడకుండ మింగవలెను.* |
| *హెచ్చరిక:* | *వికటించవచ్చు. వ్యసనలోలత కి అవకాశమున్నది.* |
| *ప్రత్యేక హెచ్చరిక:* | *హెచ్చరికని చూడుడు.* |

# దైవజాతకుడు

"చల్లకొచ్చి ముంత దాచడం ఎందుకు? చూపించు చూపించు"

తను చెయ్యి చాచేడు.

"ఆ చెయ్యి కాదు. ఈ చెయ్యి"

గుప్పిలి మూసుకునుంది. కొద్దిగా వణుకుతోంది.

"అలా మూస్తే ఎలా? బలే వాడివే.. తెరు తెరు"

వణుకు ఎక్కువైంది. గుప్పిలి మరింత బిగుసుకుంది.

"ఇదిగో చూడూ.. పుట్టిన్నాటి జాతకం ఎలాగూ లేదంటున్నావ్. ఆ మాట కొస్తే ఎప్పుడు పుట్టిందీ తెలీదంటున్నావ్.. ఇంకా రెట్టిస్తే అసలు నేను పుట్టే లేదనేట్టున్నావ్.. ఎలామరి? ఉన్నదల్లా నీ చెయ్యీ, దాన్లో గీతలూనూ.. నేను చెప్పగలిచేదేదైనా ఉంటే చెయ్యిచూసి చెప్ప గలి గేదే కానీ చూడకుండా కాదు. ఏదీ..కాస్త చూణ్ణీ"

చెయ్యి నెమ్మదిగా తెరుచుకుంది. ఆరోగ్యంగా ఉంది. రేఖలు స్ఫుటంగా కనిపిస్తున్నాయ్. ఇంతవరకూ బిగపట్టి ఉండడం వల్లనేమో ఎర్రటి చాయలు అక్కడా అక్కడా కనబడుతున్నాయ్. వణుకు మాత్రం అలాగే ఉంది.

"ఆహా.. ఏవి చెయ్యి.. ఏవి చెయ్యి.. ఇది పాణా పద్మవా.. ఇలాటి చెయ్యి మరొహానాడు, మరొహాడికి చూసెరగను. రాజాలాటి చెయ్యి. అసలిలాటి చెయ్యున్నవాడు చూపించుకోనే అక్కర్లేదు, గొప్పకి తప్పు! నీ మొహం చూస్తే నీకా వాంఛ లేనట్టుంది. ఏవిటి విషయం?"

చెప్పబోయేడు.

"ఉండుండు.. విషయవేదో నువ్వే చెప్పేస్తే నా ఘనతేవుంది? ఎంత అమాయకుడివోయ్.. నన్ను చెప్పుకోనీ.. ఆహా..చూపు తిప్పబుద్ధి కావడం లేదు సుమా. చూసినకొద్దీ చూడాలనిపిస్తోంది. సుమసమలాలిత్యం .. నొక్కి చూతునా.. అరె..బలే పటిష్టంగా ఉందే. సౌకుమార్యం, దార్ఢ్యం.. దేనికదే అవునా? ఆగాగు.. చెప్పకు.. నన్ను చెప్పుకోనీ.. అవును, ముమ్మాటికీ అవును. కాదని నా కళ్ళతో నేననలేను"

తను చెయ్యి వెనక్కి లాక్కున్నాడు.

"అదేవిటి..నిప్పు తాకినట్టు వెనక్కి లాగేసుకున్నావ్. నేనేవన్నా అశుభం పలికేనా, అసత్యవాడేనా? చెయ్యి చూసేను, కనబడ్డది చెప్పేను. ముద్రలు, రేఖలూ, సంకేతాలు సుస్పష్టంగా గోచరిస్తూంటే .. కనబడ్డది కాదంటావటోయ్.? ఏదీ ఇలా తే .. చూదాం."

తను చెయ్యి సగం అందించేడు. మిగతాది బలవంతంగా లాక్కోబడింది.

"నువ్వెందుకు సందేహిస్తున్నావో కానీ, ఇదిప్పటిదా?ఎప్పటిదోను. అతి ప్రాచీనం. కాదనడానికీ, ప్రశ్నించడానికీ మన తెలివి చాలదు. అసలిది తెలివితేటలకి లొంగే వ్యవహారవా? వఠ్ఠి కల్ల. అసలీ దివ్యజ్ఞానవనీది ప్రాకృత దృష్టికి గోచరిస్తుందా?.. అప్రాకృత దృష్టి కావాలి. దివ్యచక్షువుక్కానీ గోచరించని విజ్ఞానం దిక్కుమాలిన తెలివితేటలకందుతుందా? దీన్లెక్క ప్రకారం నీ చెయ్యి నిజాన్ని నిలువెత్తు మూర్తిని చేసి నీ ముందు నిలబెడుతుంది. ఏమొహం పెట్టుకుని కాదంటాం? అయినాకానీ మొహానిదేవుంది? ఏ పూతన్నా పూసుకుంటుంది. ఏ ముసుగన్నా వేసుకుంటుంది. చెయ్యికలా కాదే. మొహానికందని భావాలు చేతిలో పలుకుతాయి. తత్కారణాత్.. సందేహించకు.. చూణ్ణీ.. ఆహా.. ఏవి చెయ్యి.. ఎత్తులూ, పల్లాలూ ఎంత సహజంగా ఇవిడిపోయేయ్. ఇహ రేఖలంటావా. ఆరితేరిన గీతగాడు కొలిచి గీసినట్టున్నాయి. చీలాల్సినచోట చీలుతూ, కలవాల్సినచోట కలుస్తూ, ఆయుష్షు, కీర్తి, సంతానం, సౌభాగ్యం, పదవి, పరపతి.. ఒహటేవిటి.. దేని పౌష్కల్యం చూసినా సంభ్రమజనకంగా ఉంది. నీకు రాజయోగం తప్ప మరోటి రాసున్నట్టు కనబట్టం లేదు. నీ ఆయుర్దాయం అనంతం. యశస్సు అనశ్వరం. సర్వ వ్యాప్తమవుతుంది. దిగంతాలు తడుతుంది. మరి నీశక్తి అనన్యం. దానికి లొంగనిది ఉండదు. అంతెందుకు.. ఇదిగో చూడు.. ఈ ఒక్క రేఖనీ చూడు. జెర్రిగొడ్డులా.. ఇదొక్కటి చాలు. నీ చేత తోసి రాజనిపిస్తుంది. ప్రపంచాన్నేలిస్తుంది. ఒక్క ప్రపంచవేవిటి.. సకల చరాచరాత్మక విశ్వసమస్తాన్నీ నీ అధీనం చేయిస్తుంది. నీ గుప్పిట్లో పెడుతుంది. నువ్వు ఊఁ అంటే విశ్వం కదుల్తుంది. కాదంటే మాన్తుంది. అసలననే అక్కల్లేదు. తలపు చాలు. తక్షణం అమలవుతుంది. నీకు తిరుగుండదు..."

అతని మొహం వికసించలేదు. చెయ్యి ఇంకా వణుకుతూనే ఉంది. అతను ఆశించినది వినబడినట్టు లేదు.

"దైవ జాతకుళ్ళా ఉన్నావ్.. ఎవరు నాయనా నువ్వు? నీ చేతికీ మొహానికీ పొంతన లేదే? నీ చేతిని బట్టి నీ మొహం ధగద్ధగాయమానంగా వెలిగిపోవాలి. కళ తరిగి ఉందేం?"

తను నోరు విప్పి ఏదో అనబోయేడు. పెదవి వణికింది. మాట రాలేదు. మొహం నిస్తేజమై ఉంది. కళ్ళ వెంట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నయ్.

"..అదేవిటి అలా దు:ఖిస్తున్నావ్?. ఇలాటి చెయ్యి ఉన్నవాడు అలా బేల కావడానికి వీల్లేదే. ఏదో లొసుగుంది.. ఏదీ సరిగా చూణ్ణీ.. ఈ రేఖల ప్రకారం.. మరి అణిమాద్యష్టసిద్ధులూ, స్థైర్య ధైర్య శౌర్య పరాక్రమాలూ,.. అన్నట్టు.. ఆగాగు.. ఈ రెండు రేఖలూ.. ఎక్కడ దాక్కున్నాయ్ ఇంత వరకూ..చూళ్ళేదు సుమా. చర్మచక్షువు మందగించినట్టుంది. జెర్రిగొడ్లన్నానే.. అది పోలిక కోసవే కానీ రేఖలు జరజరా పాక్కు పోతాయా ఏం? కళ్ళు నులువుకుని చూస్తే కనబడక ఎక్కడికి పోతాయ్.?..

ఈ రేఖల ప్రకారం.. ఆహా.. ఈ చెయ్యి కరవాలమూ పట్టగలదు కరుణా చూపగలదు; అరిభంజనమూ చేయగలదు అభయమూ ఇవ్వగలదు. నీ శక్తికెలాగైతే అంతులేదో నీదయకీ అంతులేదు. నువ్వు ఆపత్సఖుడవు, అర్థి కల్పకుడవు, నీ పేరు కోరి చాటుతారు.. ఎందుకంటే అది తలిస్తే చాలు.. ఇహ నేను చెప్పాల్సిన అవసరం లేదు.. ఆర్తులు సకల భయ పీడా రోగాది వర్జితు.."

మాట పూర్తి కాలేదు. అతనికి దు:ఖం కట్టెలు తెంచుకుంది. మహావేదనతో బరువెక్కిన మనసుకి ఒక్కసారి చిల్లు పడ్డట్టు చేతుల్లో మొహం దాచుకుని భోరుమన్నాడు. ఏదో చెప్పబోతున్నాడు. మాట స్పష్టత లేదు. దు:ఖాతిశయంతో వెక్కుతున్నాడు. కొంచెం శ్రద్ధగా వింటే మాత్రం వినబడుతుంది, తన దయకి తగ్గ శక్తి తనకి లేదని అతనంటూన్నట్టు. అతనంటే సరేనేవిటి? అతని చెయ్యి ఒప్పుకోద్దూ ఆమాటని? రాజాలాటి చెయ్యా మరోటా?

